# బీఆర్‌ఎస్‌కు తిరుగులేదు ప్రతిపక్షాలకు ఉనికిలేదు

**అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై గులాబీ పార్టీలోకి భారీగా వలసలు**

**మంత్రి మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు యాదయ్య, మహేశ్‌రెడ్డి, రోహిత్‌రెడ్డి సమక్షంలో పలు పార్టీల శ్రేణుల చేరిక**



మంత్రి మహేందర్‌రెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరిన కాంగ్రెస్ నాయకులు

బొంరాస్‌పేట, నవంబర్ 24 : కార్యకర్తలు, నాయకులు కొడంగల్‌లో బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థి గెలుపునకు కృషి చేయాలని రాష్ట్ర గనులు భూగర్భ వనరుల శాఖల మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం బొంరాస్‌పేట మండలం బురాన్‌పూర్ గ్రామానికి చెందిన మాజీ ఉప సర్పంచ్ నీరటి అంజిలయ్య, నీటి తీరువా సంఘం మాజీ డైరెక్టర్ కాయలి బందెప్ప మంత్రి సమక్షంలో కాంగ్రెస్ నుంచి బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో బీఆర్‌ఎస్‌కు అనుకూల పవనాలు వీస్తున్నాయని, బీఆర్‌ఎస్ హ్యాట్రిక్ విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ గ్యారంటీలను ప్రజలు నమ్మడంలేదని, సీఎం కేసీఆర్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ఆదరిస్తున్నారని మంత్రి అన్నారు. కొడంగల్ నియోజకవర్గంలో ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డిని రెండోసారి మంచి మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ సురేశ్‌కుమార్, సింగిల్ విండో డైరెక్టర్ నర్సింహులు, పార్టీ నాయకులు రాములు, సంగప్ప, రాంచంద్రయ్య పాల్గొన్నారు.

## బీఆర్‌ఎస్‌తోనే అన్ని వర్గాలకు న్యాయం

షాబాద్ : తెలంగాణలో బీఆర్‌ఎస్‌కు తప్ప ప్రతిపక్షాలకు భవిష్యత్తు లేదని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య, షాబాద్ జడ్పీటీసీ పట్నం అవినాశ్‌రెడ్డి అన్నారు. శుక్రవారం షాబాద్‌లోని జడ్పీటీసీ నివాసంలో మండలంలోని సర్దార్‌నగర్ గ్రామానికి చెందిన ముదిరాజ్ సంఘం నాయకులు ఎమ్మెల్యే, జడ్పీటీసీ సమక్షంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యాదయ్య మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ చేస్తున్న అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై ఇతర పార్టీల నుంచి గులాబీ గూటికి పెద్దఎత్తున వలసలు వస్తున్నట్లు తెలిపారు. గతంలో ఏ ప్రభుత్వాలూ చేయని అభివృద్ధి సీఎం కేసీఆర్ తొమ్మిదన్నరేండ్ల పాలనలో చేసి చూపించినట్లు స్పష్టం చేశారు. గ్రామాల్లో బీఆర్‌ఎస్ పార్టీ ఎన్నికల ప్రచారానికి ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని చెప్పారు. ఢిల్లీ నాయకులు తెలంగాణపై పెత్తనం చేయాలని చూస్తే ఇక్కడి ప్రజలు చూస్తూ ఊరుకోరని, బీఆర్‌ఎస్‌తోనే అన్ని వర్గాలకు న్యాయం జరుగుతుందని వారు చెప్పారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు వెంకటయ్య, నర్సింహులు, రామ్మోహన్‌గుప్తా, హరీశ్, ప్రదీప్, శశాంక్‌రెడ్డి, ఖలీల్ పాల్గొన్నారు.



ఎమ్మెల్యే కాలె యాదయ్య, జడ్పీటీసీ పట్నం అవినాశ్‌రెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరుతున్న సర్దార్‌నగర్ గ్రామ ముదిరాజ్ సంఘం నాయకులు

## సీఎం కేసీఆర్ పాలనలోనే మైనార్టీల సంక్షేమం



పార్టీ కండువాలు కప్పి బీఆర్‌ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి

పరిగి : సీఎం కేసీఆర్ తొమ్మిదిన్నర సంవత్సరాల పాలనలోనే మైనార్టీల సంక్షేమానికి ప్రభుత్వం విశేష కృషి చేసిందని పరిగి ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ అభ్యర్థి కొప్పుల మహేశ్‌రెడ్డి తెలిపారు. పరిగిలో శుక్రవారం కులకచర్ల మండలం కులకచర్ల, బండవెల్కిచర్ల, ఇప్పాయిపల్లి, కుసుమసముద్రం, చౌడాపూర్, కన్మన్‌కల్వ, అంతారం, ముజాహిద్‌పూర్, పుట్టపహాడ్‌లకు చెందిన 300 మంది మైనార్టీలు ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గతంలో కాంగ్రెస్ హయాంలో మైనార్టీలను కేవలం ఓటు బ్యాంకుగానే వాడుకుందని, మైనార్టీల సంక్షేమాన్ని పట్టించుకోలేదని విమర్శించారు. బీఆర్‌ఎస్ అధికారంలోకి వచ్చిన తర్వాత సీఎం కేసీఆర్ మైనార్టీల సంక్షేమానికి బడ్జెట్‌లో నిధులు పెంచడంతోపాటు అనేక కార్యక్రమాలు అమలు చేశారన్నారు. మైనార్టీ యువతుల వివాహానికి షాదీముబారక్ కింద రూ.1,00,116 అందించినట్లు పేర్కొన్నారు. ఇమామ్, మౌజమ్‌లకు గౌరవ వేతనం ఇస్తున్నట్టు తెలిపారు. నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో మదర్సాలు, షాదీఖానా, ఈద్గా, కమ్యూనిటీ హాళ్లు, మసీదుల ప్రహరీల నిర్మాణానికి రూ.5కోట్లు మంజూరు చేశారని పేర్కొన్నారు. బీఆర్‌ఎస్ హయాంలోనే గంగా జమున తెహజీబ్‌తో అన్ని వర్గాల ప్రజలు కలిసిమెలిసి ఉన్నారని మహేశ్‌రెడ్డి పేర్కొన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ కులకచర్ల మండల అధ్యక్షుడు రాంరెడ్డి, రైతు బంధు సమితి అధ్యక్షుడు రాజు, జడ్పీ మాజీ కో-ఆప్షన్ సభ్యుడు మీర్ మహమూద్‌అలీ, బీఆర్‌ఎస్ నాయకులు కృష్ణ, వాజిద్, మోబిన్, రుక్కుబాయి, మౌలానా, అన్వర్‌హుస్సేన్, తాహెర్‌అలీ పాల్గొన్నారు.

## అందరి చూపు.. బీఆర్‌ఎస్ వైపు..

తాండూరు : ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత సీఎం కేసీఆర్ అమలు చేస్తున్న పథకాలకు ఆకర్షితులై తాండూరు నియోజకవర్గంలో వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు యువత, మహిళలు బీఆర్‌ఎస్‌లో చేరుతున్నారు. శుక్రవారం తాండూరు పట్టణం, తాండూరు, యాలాల, బషీరాబాద్, పెద్దేముల్ మండల పరిధిలోని గ్రామాల ప్రజలు ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. రాష్ట్ర ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలతో పాటు తాండూరులో ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి చేసిన అభివృద్ధికి ఆకర్షితులై తాండూరును మరింత అభివృద్ధి చేయుటకు బాసటగా నిలిచేందుకు బీఆర్‌ఎస్‌లో చేరినట్లు తెలిపారు. తనకు సంపూర్ణ మద్దతు తెలుపుతూ పార్టీలో చేరిన యువతకు కృతజ్ఞతలు తెలిపారు. అత్యధిక మెజార్టీతో తనను గెలిపించుటకు అందరూ సహకరించాలని రోహిత్‌రెడ్డి కోరారు.



ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరిన యువకులు

## సీఎం కేసీఆర్ సభలతో..

# నయా జోష్..

- జిల్లాలో సీఎం సభలు గ్రాండ్ సక్సెస్..
- ఇబ్రహీంపట్నం, మహేశ్వరం, కల్వకుర్తి బీఆర్‌ఎస్ ప్రజా ఆశీర్వాద సభలకు విశేష స్పందన
- ఈ నెల 27న చేవెళ్ల, షాద్‌నగర్ సభల్లో పాల్గొననున్న సీఎం కేసీఆర్
- ఎన్నికల్లో సమన్వయంతో ముందుకు సాగుతున్న నేతలు
- సభలకు స్వచ్ఛందంగా తరలివస్తున్న ప్రజలు
- బీఆర్‌ఎస్ పార్టీ శ్రేణుల్లో ఉరకలెత్తుతున్న ఉత్సాహం



రంగారెడ్డి, నవంబర్ 24 (నమస్తే తెలంగాణ) : సీఎం కేసీఆర్ సభలు జిల్లాలో గ్రాండ్ సక్సెస్ అవుతున్నాయి. బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థులకు మద్దతుగా నిర్వహిస్తున్న ప్రజా ఆశీర్వాద సభలకు జనం ఉవ్వెత్తున తరలివస్తున్నారు. ఇప్పటికే జిల్లాలోని ఇబ్రహీంపట్నం, మహేశ్వరం, కల్వకుర్తి నియోజకవర్గాల్లో సీఎం కేసీఆర్ సభలు జరుగగా పల్లెలు, పట్టణాలు, మారుమూల తండాల నుంచి జనం పెద్దఎత్తున సభలకు తరలివచ్చి విజయవంతం చేశారు. సీఎం కేసీఆర్ ప్రసంగంలోని యాస, అభివృద్ధి లెక్కలు ప్రజలను ఆకట్టుకుంటున్నాయి. సమైక్య పాలన పరిస్థితులు, స్వరాష్ట్రంలో జరిగిన సమగ్ర అభివృద్ధి, సంక్షేమ వివరాలు ప్రజలను ఆలోచింపజేస్తున్నాయి. సభల సందర్భంగా నేతలు సైతం సమన్వయంతో ముందుకు సాగుతున్నారు. సీఎం సభలతో రంగారెడ్డి జిల్లాలో గులాబీ జెండాకు ఎదురేలేదన్న చర్చ జోరుగా సాగుతుండగా.. బీఆర్‌ఎస్ పార్టీ శ్రేణుల్లోనూ ఉత్సాహం ఉరకలెత్తుతున్నది.

ఎన్నికల వేళ బీఆర్‌ఎస్ నేతలంతా సీఎం ఆశీర్వాద సభల విజయవంతానికి ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళ్తున్నారు. జన సమీకరణలోనూ కలిసికట్టుగా వ్యవహరిస్తుండడంతో ప్రజలు లక్షలాదిగా తరలివస్తున్నారు. సీఎం కేసీఆర్ తన యాసతో ప్రసంగాల్లో కాంగ్రెస్, బీజేపీలపై విరుచుకుపడుతున్న తీరు సైతం ప్రజలను ఆకట్టుకుంటున్నది. కేసీఆర్ ప్రసంగాన్ని వినేందుకు ఊర్లకు ఊర్లే తరలివస్తున్నాయి. 24 గంటల కరెంటు కావాలా? 3 గంటల కరెంటు కావాలా? అంటూ కేసీఆర్.. ప్రతి సభలోనూ జనాలను అడుగుతున్నారు. కాంగ్రెస్ నేతలు దుబారా అంటున్న రైతు బంధు ఉండాలా? వద్దా? అని కేసీఆర్ ప్రశ్నిస్తుండగా.. ప్రతి సభలోనూ ప్రతి ఒక్కరూ చేతులెత్తి కేసీఆర్‌కు సంఘీభావం తెలుపుతున్నారు. తొమ్మిదన్నరేండ్లలో జరిగిన అభివృద్ధి, సంక్షేమాన్ని విస్తృతంగా వివరించడంతోపాటు, అభివృద్ధితో ఆగొద్దంటే.. మ్యానిఫెస్టోలోని హామీలు ప్రజలకు అందాలంటే మరోసారి బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. సీఎం కేసీఆర్ మాట తప్పడు, మడమ తిప్పడు అనే అచంచల విశ్వాసమే సీఎం కేసీఆర్ స్పీచ్ పట్ల ప్రజలు ఆసక్తి చూపడానికి కారణమని పార్టీ శ్రేణులు చెబుతున్నారు.

### సభలకు పోటెత్తుతున్న జనం

జిల్లాలో మంత్రి సబితారెడ్డి, ఎమ్మెల్యేలు కిషన్‌రెడ్డి, జైపాల్‌యాదవ్‌లకు మద్దతుగా సీఎం కేసీఆర్ సభలు జరిగాయి. ఈ సభలకు చిన్నా, పెద్దా, ముసలి ముతక, ఆడ మగ తేడా లేకుండా సభలకు జనం తండోపతండాలుగా తరలివచ్చారు. జనం పోటెత్తడంతో అన్ని చోట్లా సభలు జన జాతరను తలపించాయి. పార్టీ శ్రేణులతో పాటు అభిమానులు, వివిధ పథకాల లబ్ధిదారులు, సామాన్య ప్రజానీకం అశేషంగా వచ్చి సీఎం కేసీఆర్ ప్రసంగాన్ని శ్రద్ధగా ఆలకిస్తున్నారు. ఈ నెల 27న చేవెళ్ల, షాద్‌నగర్‌లలో ఎమ్మెల్యేలు యాదయ్య, అంజయ్యయాదవ్‌ల తరపున నిర్వహించే ప్రజా ఆశీర్వాద సభల్లో సీఎం కేసీఆర్ పాల్గొననున్నారు. ఈ సభలకు సైతం వేలాదిగా తరలివచ్చేందుకు జనం సన్నద్ధులు అవుతుండడం విశేషం. సీఎం కేసీఆర్ సభలకు వస్తున్న స్పందనను చూస్తుంటే రంగారెడ్డి జిల్లాలో అన్ని స్థానాల్లో గులాబీ జెండాకు ఎదురుండదన్న చర్చ జోరుగా సాగుతున్నది. పిడికెడు మందితో తెలంగాణ ఉద్యమం ప్రారంభం నాటి నుంచే అశేష జనం కేసీఆర్‌పై విశ్వాసంతో వెంట నడిచిందని, ఇప్పటి వరకు కూడా అదే విశ్వాసంతో వెంట నడుస్తున్నదని బీఆర్‌ఎస్ నేతలు పేర్కొంటున్నారు.

## కారులో కలిసి వెళదాం.. గ్రామాలను గుర్తుపట్టి తీసుకెళ్లు..

- రేవంత్‌రెడ్డికి ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి సవాల్

కొడంగల్, నవంబర్ 24 : నియోజకవర్గంలో ఏ ఊరు ఎక్కడ ఉందో రేవంత్‌రెడ్డికేం తెలుసని, 10 సంవత్సరాల్లో పట్టుమని 10 సార్లు కూడా రాని ఆయన నేటికి కూడా తిరగని గ్రామాలు, తండాలెన్నో ఉన్నాయని ఎమ్మెల్యే అభ్యర్థి పట్నం నరేందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని దోరేపల్లి, పల్లెగడ్డతండా, ఎర్రగోల్‌తండా, అప్పిరెడ్డిపల్లి, అచ్చంపల్లి, చెన్వార్, పర్సాపూర్, దామ్‌గాన్పూర్, నాగిరెడ్డిపల్లి, నాగంపల్లి, ఖాజీపూర్, రేణివెట్ల గ్రామాల్లో ఎన్నికల ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని ఏ ఊరైనా సరే.. ఊరి పేరు చెప్పుకొని ఇద్దరం కలిసి కారులో వెళదామని, ఆ ఊరిని చూపించాలని రేవంత్‌కు సవాల్ విసిరారు. ఈ 5 సంవత్సరాల్లో ప్రతి గ్రామాన్ని, తండాను చాలా సార్లు వెళ్లి ప్రజా సమస్యలను తెలుసుకున్నానని పేర్కొన్నారు. అక్కడి ప్రజలు ఎమ్మెల్యేనిప్పుడే చూస్తున్నామని చెప్పడం చాలా ఆశ్చర్యం వేసిందన్నారు. గతంలోని ఎమ్మెల్యేను ఎన్నికల్లో నిర్వహించిన రోడ్‌షోలో మాత్రమే చూశామని, ఏనాడూ మా గ్రామాలు, తండాలకు రాలేదని ప్రజలు పేర్కొన్నారన్నారు. ఇటువంటి వ్యక్తి ప్రజా శ్రేయస్సును ఏవిధంగా కోరుకుంటారని.. అందుకే ప్రజలు గత ఎన్నికల్లో తిరస్కరించారన్నారు. ప్రజల మధ్య ఉండే నాయకుడిని ఎన్నుకోవాలని.. గత 5 సంవత్సరాల కాలంగా ప్రజల మధ్య ఉంటూ ప్రజా సమస్యలను సొంత సమస్యలుగా గుర్తించి వాటి పరిష్కారానికి ఎనలేని కృషి చేసినట్లు పేర్కొన్నారు. కారు గుర్తుకు ఓటేస్తే అభివృద్ధి, సంక్షేమం అండగా నిలుస్తుందని.. కాంగ్రెస్‌కు ఓటేస్తే 3 గంటల కరెంటు, అభివృద్ధి, సంక్షేమం 20 సంవత్సరాలు వెనక్కి వెళ్లిపోతుందని నరేందర్‌రెడ్డి ఆరోపించారు.

